# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖ వేదికగా నవంబర్ లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- ❖ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానితో ఈరోజు సమావేశం అయ్యారు.

- ❖ వెస్టిండీస్ తో జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ విజయానికి ఇంకా 58 పరుగు చేయాల్సి ఉంది.

- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

విశాఖపట్టణం వేదికగా నవంబర్ 14, 15వ తేదీలలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సదస్సు సన్నాహకాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని నిర్ణయించామని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సుకి 29 దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులు, 80 బహుళజాతి సంస్థలకు చెందిన సీఈవోలు, 40 దేశాల నుంచి ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రం త్వరలోనే కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందని సదస్సులో ఈ అంశాలు, రాష్ట్ర ఆకాంక్షలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని, విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

=====================

రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇందులో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. మిగిలిన 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రైవేట్ గా బహిరంగ మార్కెట్ లో అమ్ముకోవచ్చన్నారు. ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమావేశం నిర్వహించి జాయింట్ కలెక్టర్లు, ఇతర పౌర సరఫరాల శాఖ అధికారులతో ఈరోజు సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వరి పండించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలుస్తుందన్నారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి బ్యాంక్ ఖాతాలకు నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో మొదటి సారిగా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలియజేశారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కొద్ది సేపటి క్రితం సమావేశమైన ముఖ్యమంత్రి విశాఖపట్టణంలో జరగనున్న సీఐఐ పెట్టుబడుల సదస్సుకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వెంట కేంద్రమంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ తో పాటూ పలువురు పార్లమెంట్ సభ్యులు కూడా ఉన్నారు. ఇక ఈ పర్యటనలో భాగంగా రేపు గూగుల్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసుకునే అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

=====================

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతుల కల్పనపై అధ్యయనానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. మొత్తం 10 మంది మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీవోఎం)లో సభ్యులుగా ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తో పాటూ మంత్రులు కె.అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, పి.నారాయణ, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, గుమ్మిడి సంధ్యారాణి ఉన్నారు. పదోన్నతుల ఖరారుకు ఆయా విభాగాలకు సూచనలు జారీ చేయాలని ఉప సంఘాన్ని కోరింది. పదోన్నతుల తర్వాత ఖాళీలు భర్తీ చేసే పద్ధతిపైనా చర్చించాలని సూచించింది. వీలైనంత త్వరగా అధ్యయనం చేసి.. సిఫార్సులతో నివేదించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

=====================

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ రేపటి నుండి రెండు రోజుల పాటూ రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్‌లో పర్యటించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్ పై చర్చించేందుకు నిర్వహిస్తున్న ఒక కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి హాజరు కానున్నారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులు పాల్గొనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర బడ్జెట్ 2025-26 ప్రకటనల అమలుపై మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్ర విజన్‌ను సమర్పించనున్నారు. జాతీయ మిషన్ కింద రాష్ట్ర ప్రతిపాదనలను మంత్రి ఈ సందర్భంగా వివరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హాజరుకానున్నారు.

విరామం

=====================

క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీని మినహాయించడంతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో

ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా బసవనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 64 లక్షల రూపాయలతో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. అదే విధంగా భరత్ నగర్ లో కోటి రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి "సూపర్ జీఎస్టి - సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ" లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో తిరుగుతూ.. ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలు దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలకృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

వెస్టిండీస్ తో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ విజయం దిశగా పయనిస్తోంది. తొలి ఇన్నింగ్స్ లో 518 పరుగుల భారీ స్కోర్ చేసిన భారత్.. వెస్టిండీస్ ను 248 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో ఫాలోవాన్ ఆడాల్సి రావడంతో రెండవ ఇన్నింగ్స్ ఆరంభించిన వెస్టిండీస్ ఓ దశలో భారీ స్కోర్ దిశగా ప్రయత్నించినప్పటికీ నాలుగవ రోజు రెండవ సెషన్ లో స్వల్ప వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోవడంతో 390 పరుగులు మాత్రమే చేయగలిగింది. 121 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనను ప్రారంభించిన భారత్ ఈరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 58 పరుగు చేయాల్సి ఉంది.

====================

కోస్తాంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న దక్షిణ తమిళనాడు తీరం మీదుగా సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 3.1 కిలో మీటర్ల ఎత్తులో మరో ఉపరితల ఆవర్తనం కూడా విస్తరించి కొనసాగుతోందని పేర్కొంది. వీటి ఫలితంగా రేపటి వర్ష సూచనలను వాతావరణ శాఖాధికారి ఎం.వెంకట్రావ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================
====================